

వైసీపీ ఐదేళ్ల పాలనలో కడప నగరం కబ్జాలమయంగా మారింది. ఆ ప్రభుత్వంలో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. జాగా ఏదైతేనేం పాగా వేసెయ్ అనే ధోరణిలో బరితెగించారు. రిజిస్ట్రేషన్ అధికారులతో కుమ్మక్కై వందల ఎకరాలు కబ్జా చేసి అందినకాడికి దోచేశారు. కాగా కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే కబ్జాలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రూ.20 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో వైసీపీ నేతలకు బిగ్ షాక్ ఇచ్చినట్లయింది.

జిల్లాలో నేడు, రేపు భారీ వర్షాలు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి
- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో సోమ, మంగళవారం భారీ వర్షాలు కురవనున్నాయని, విపత్తును ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. ఆదివారం ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను ప్రభావం జిల్లాలో ఉన్నందున అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలు తూచా తప్పకుండా పాటించాల న్నారు. 27, 28వ తేదీల్లో తుఫాన్ ప్రభావం వల్ల జిల్లా అంతా రెడ్ అలర్ట్ జారీ చేశామని, అధికారులకు ఈ రెండు రోజులు సెలవులు ఉండవన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు రెండు రోజుల పాటు సెలవు ప్రకటించామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు ముందుగా పునరావాస కేంద్రాలకు తరలించాలని, తాగునీరు, మౌలిక వసతులు, ఆహార సరఫరా, విద్యుత్, వైద్య సేవలందించాలన్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి, పశు పంట నష్టాలు జరగకూడదని ఆర్డీవోలను ఆదేశించారు. ముఖ్యంగా వర్ష ప్రభావం ఎక్కువగా ఉన్న ఏరియాల్లోని గర్భిణీలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు. 24 గంటలు వైద్యసేవలందేలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులను బట్టి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఇందుకు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అత్యవసర సహాయ చర్యల కోసం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబరు 08562- 246344, 295990తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్లను సంప్రదించవచ్చన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ స్పెషల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలు విడుదల

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో సంభవించే బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు, వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తక్షణ సాయం కింద జిల్లాకు రూ.50 లక్షలు విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 25న రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు, కీలక శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో రాబోయే తుఫానుకు సంబంధించి నిధుల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం టీఆర్-27 ఖాతా కింద వైఎస్సార్ కడప జిల్లాకు రూ.50లక్షల మొత్తాన్ని వినియోగించుకునేందుకు అనుమతించింది. ఇందుకు సంబంధించిన బిల్లులు 30 రోజుల్లో సమర్పించాలని, వినియోగించని నిధులను తిరిగి జమ చేయాలని కలెక్టర్లకు సూచించింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధంగా ఉందని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో మూడు ప్రత్యేక బృందాలతో పాటు ప్రతి పోలీసు సబ్ డివిజనులో ఒక రెస్క్యూ టీం సిద్ధం చేశామని తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొనే బృందాలకు అవసరమైన లైటింగ్ సామగ్రి, లైఫ్ జాకెట్లు, టార్చ్‌లైట్లు, సహాయక చర్యల నిమిత్తం తాళ్లతో సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నదులు, వాగులు, వంకల పరివాహక ప్రాంతాల్లో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అత్యవసర సమయాల్లో డయల్ 112 నెంబరుకు ఫోను చేయాలన్నారు.

నేడు, రేపు పాఠశాలలకు సెలవు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచనలు, హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, అంగన్వాడీ పాఠశాలలకు సోమ, మంగళవారం రెండు రోజుల పాటు సెలవులను ప్రకటించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.

కబ్జాలకు కళ్లెం

- రూ.20కోట్ల ప్రభుత్వ భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్
- రద్దుకు కలెక్టరు ఆదేశం
- ముగ్గురు వైసీపీ నేతలకు బిగ్‌షాక్



చెర్లోపల్లెలోని విలువైన ప్రభుత్వ భూములు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు నగరంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి రద్దు చేసేందుకు తహసీల్దారు నాగేశ్వర్‌రావును కలెక్టరు చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. దీంతో ఆ ముగ్గురు వైసీపీ నేతలు షాక్‌కు గురయ్యారు. ఈ ఆక్రమణలో ఓ టీచరు కూడా ఉన్నట్లు గమనార్హం. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారు ఉన్నత స్థానాలు చేరేలా చూడాల్సిన ఆ ఉపాధ్యాయుడు విధి నిర్వహణను గాలికి వదిలేసి వైసీపీ నేతలతో చెట్టాపట్టాలు వేసుకుని భూకబ్జాలకు పాల్పడ్డారనే విమర్శలున్నాయి. పాపం పండినట్లుగా ఇప్పుడు చంద్రబాబు సర్కారు రావడంతో వైసీపీ భూకబ్జాల సామ్రాజ్యాన్ని కలెక్టర్ కూలదోసేందుకు పన్నాగం వేశారు. కోటి రెండు కోట్లు కాదు.. సుమారు రూ20కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలంటూ ఆదేశించడంతో కబ్జాదారులు హడలెత్తిపోతున్నారు. కాగా ఈ భూములన్నీ నిషేధిత జాబితాలో ఉండడం గమనార్హం.

రింగురోడ్డు చుట్టూ కొట్టేశారు

కడప నగరం.. ఇటు కడప అటు కమలాపురం నియోజకవర్గం పరిధిలో విస్తరిస్తోంది. సీకేదిన్నె, చెన్నూరు, వల్లూరు మండలాలు కడప నగర శివారులో ఉన్నాయి. దీంతో అక్కడ భూములకు భలే డిమాండ్ ఉంది. ఇక్కడ రింగు రోడ్డు చుట్టూ ఎకరం రూ.3 కోట్ల నుంచి 5 కోట్లు ఉంది. ఇక్కడి భూములపై కమలాపురానికి చెందిన ముగ్గురు వైసీపీ నేతలు కన్నేశారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు అధికారం చెలాయించి అడ్డగోలుగా భూములు కొట్టేశారని చెబుతారు. అయితే ఈ నేపథ్యంలో సీకేదిన్నె మండలంలోని క్రిష్ణాపురం, చెర్లోపల్లె రెవెన్యూ భూములన్నీ రింగురోడ్డు పక్కనే ఉన్నాయి. ఇక్కడ ఎకరం రూ.2 కోట్ల నుంచి 3 కోట్ల పైమాటే ఉంది. ఇక్కడ నిషేధిత జాబితాలో ఉన్న భూములను ముగ్గురు వైసీపీ నేతలు కొట్టేశారు. రిజిస్ట్రేషన్ అధికారులతో కుమ్మక్కై వాటిని రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం గమనార్హం. ఈ భూములు వైసీపీ నేతలకు ఎలాంటి సంబంధం లేకుండా ఫోర్జరీ పట్టాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెబుతారు. ఈ నేపథ్యంలో ఈ భూ ఆక్రమణలపై సామాజిక కార్యకర్త లంబోదర ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించారు. చెర్లోపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెం.156/2లో 3.02 ఎకరాలు, 158/2లో 0.85 ఎకరాలు, 158/4లో 2.05 ఎకరాలు, 158/5లో 1.75, 134/2లో 0.37, 136/4లో 0.72, క్రిష్ణాపురం సర్వే నెం.22/3లో మొత్తం 3.69 ఎకరాలు కలుపుకుని 14.50 ఎకరాల భూములను ఫోర్జరీ పత్రాలతో 5725, 5411, 3084గా అడ్డగోలుగా రిజిష్టరు చేయించుకున్నట్లు తెలిసింది.

రిజిస్ట్రేషన్ అధికారులను మేనేజ్ చేసి..

కడపరూరల్ సబ్ డివిజను పరిధిలో వందల కోట్లు విలువ చేసే భూములున్నాయి. ఇవన్నీ రింగురోడ్డు చుట్టూ ఉంటాయి. అయితే ఈ భూములను వైసీపీ హయాంలో అడ్డగోలుగా కబ్జా చేసి ఆక్రమించడంతో పాటు రిజిస్టరు కూడా చేయించుకున్నట్లు సమాచారం. ఇందుకు కడప రూరల్ సబ్ రిజిస్ట్రారు అధికారులు బాగా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. ఇక చెర్లోపల్లె, క్రిష్ణాపురం మొత్తం 14.50 ఎకరాలను వైసీపీ నేతల పేరిట అప్పట్లో పనిచేసిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు సహకరించినట్లు చెబుతారు. అయితే వారు ప్రస్తుతం మరణించినట్లు తెలుస్తోంది. కాగా కలెక్టర్ శ్రీధర్ భూకబ్జాలపై క్షుణ్ణంగా విచారించి వీటి రద్దుకు ఆదేశించడంతో ఆక్రమణదారులకు వణుకు పుడుతోందని చెప్పవచ్చు.

పోలీసు ఆయుధాల ప్రదర్శన

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వారు వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేర దర్యాప్తు విధానం తదితర విషయాలను విద్యార్థులకు తెలిపేందుకు ఈ ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు ఆయుధాలు, బాంబు డిస్పోజబుల్ టీం, ఫింగర్ ప్రింట్, పోలీసు కంట్రోల్ రూము, కమ్యూనికేషన్స్, నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్‌స్క్వాడ్ బృందాలు, ఆయుధాల విడిభాగాల సమాచారం గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే బాడీవార్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరా, వీహెచ్, ఎఫ్‌సెట్ రోబో డ్రెస్‌ను ప్రదర్శనలో ఉంచారు. నగరంలోని వివిధ స్కూళ్లకు చెందిన 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శివరాముడు, ఆర్ఎస్ఐలు స్వామినాయక్, అప్పలనాయుడు, రామస్వామి రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం..

ప్రజాపోరాటం అవసరం

- తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణాలను అడ్డుకోకపోతే రాయలసీమ ఎడారే
- రౌండ్‌టేబుల్ సమావేశంలో సాగునీటిరంగం ఆలోచనాపరుల ధ్వజం



నీటి ప్రాజెక్టుల కోసం సంఘీభావం వ్యక్తం చేస్తున్న ప్రతినిధులు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా అటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, విభేదిత నవ్యాంధ్రలోనూ ముఖ్యమంత్రులుగా పరిపాలన సాగించిందం తా కడప, చిత్తూరు జిల్లాలకు చెందినవారే. కానీ ప్రాజెక్టుల నిర్మాణంలో పూర్తిస్థాయి నిర్లక్ష్యం చూపారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందిం చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ప్రజలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఏపీ సాగునీటి రంగం ఆలోచనాపరుల వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపన్యా సకులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏపీ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో మన పాలకుల కంటే బ్రిటీషు వారే మేలనిపించేలా ఉందన్నారు. ఉన్న మట్టిని, నీటిని వినియోగించుకుని పంటలు పండించాలన్న ఆలోచనతో ప్రాజెక్టు నిర్మించారన్నారు. నేటి రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రాజెక్టులు నిర్మిస్తామని హామీ లిచ్చి శంకుస్థాపనలు చేయ డం మినహాయిస్తే వాటిని పూర్తి చేయడంలో తగిన ప్రాధాన్యతనివ్వడం లేద న్నారు. తత్ఫలితంగా దశా బ్దాల కాలంగా ప్రాజెక్టులు పూర్తి కాకపోగా నిర్మాణ వ్యయం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు, తాగునీటి విశ్లేషకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాగు, తాగునీటి ప్రాజెక్టుల కోసం గతంలో చేసిన పోరాటాలు వృథాగా పోలేదన్నారు. కానీ అవి పూర్తిస్థాయిలో నిర్మాణం కాకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విష యంలో తాజా పరిణామాలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో పాటు ప్రతిపక్షం పట్టించుకోకపోవడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు ఎస్.తులసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగు ప్రాజక్టులు పూర్తి చేసేందుకు తగినన్ని నిధులు ఇవ్వడంతో పాటు నీటి పారుదలశాఖలో అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. రైతు సేవా సమితి రాష్ట్ర నాయకుడు భవానీప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయరంగం బాగుపడాలంటే సాగునీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. తెలంగాణకు చెందిన మరో ప్రతినిధి చక్రవర్తి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాల్సిన పనిలేదని, పెండింగు ప్రాజె క్టులు పూర్తి చేస్తే సరిపోతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, మాజీ కార్యదర్శి క్రిష్ణమూర్తి, నాయకులు రామసుబ్బారెడ్డి, అనుబంధ సంఘాల నాయకులతో పాటు ప్రజాసంఘాల నాయకులు బి.నారాయణ, పలువురు ప్రతిని ధులు పాల్గొన్నారు.

చదువు చెప్పాలా?.. కోవాలా?

- టెట్ తప్పనిసరి చేయడంతో ఉపాధ్యాయుల్లో గందరగోళం
- సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా టెట్ ఉత్తీర్ణత కావాలంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. విద్యార్థులకు పాఠాలు చెప్పాలా? లేక టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) కోసం చదువుకోవాలా అనేది తెలియక వేలాదిమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. ప్రతి ఉపాధ్యాయుడు టెట్ ప్రిపరేషన్‌లో నిమగ్నమయితే తరగతి గదుల్లో విద్యార్థుల పరిస్థితి ఆగమ్యగోచరం అని చెప్పొలి. రాబోయే రెండు నెలలపాటు పాఠశాలల్లో బోధన మందగించే అవకాశం ఉంది. ఇరవై నుంచి ఇరవై ఐదేళ్లుగా బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు ఇపుడు మళ్లీ పరీక్ష! ఇన్నేళ్లుగా పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దుతున్న తాము ఇప్పుడు అర్హత లేనివాళ్లమా? అని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. సుప్రీం కోర్టు తీర్పుతో టెట్ అర్హత తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం సర్క్యులర్ జారీచేసినప్పటికీ.. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం అండగా నిలవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికే డేటా ఎంట్రీలు, సర్వేలు వంటి పనుల్లో నిమగ్నమవుతున్న ఉపాధ్యాయులు ఇపుడు టెట్ సన్నాహాల్లో పడితే విద్యార్థుల బోధనకు సమయం దొరకదని పాఠశాలల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనివలన చివరికి విద్యార్థులే నష్టపోతారని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. టెట్‌ను కొత్తగా నియామకాలు చేసేవారికి మాత్రమే నిర్వహించాలని సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, ఈ మేరకు ప్రభుత్వం సహకరించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

డిసెంబరు 10న టెట్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-2025) నిర్వహణకు నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. డిసెంబరు 10న పరీక్ష నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 19న ఫలితాలు ప్రకటించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్షల నోటిఫికేషన్, సమాచార బులెటిన్, పరీక్షల షెడ్యూల్, సిలబస్, అభ్యర్థులకు సూచనలు, విధివిధానాల్ని హెచ్‌టీటీపీఎస్://టెట్2డీఎస్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామని టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సందేహాలు ఉంటే సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు 8121947387, 8125046997, 7995649286, 7995789286, 9963069286, 6281704160.

ప్రత్యేక టెట్ నిర్వహించాలి



సాధారణ అభ్యర్థులకు నిర్వహించే టెట్‌ను ఇన్ సర్వీసు అభ్యర్థులకు నిర్వహించడం సరికాదు. ఎందుకంటే 10 నుంచి 25 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న సీనియర్లు వారి సబ్జెక్టుల్లో నిష్ణాతులుగా ఉంటారు. ఎప్పుడో చదివిన ఇతర సబ్జెక్టుల్లో పరీక్ష పెట్టడం సబబు కాదు. తమిళనాడు రాష్ట్రంలో లాగా ఇన్‌సర్వీస్ వారికి ప్రత్యేక టెట్ నిర్వహించాలి.

- గునిశెట్టి శ్రీనివాసులు, ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు

రివ్యూ పిటీషన్ వేయాలి



టెట్‌పై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల తరపున రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటీషన్ దాఖలు చేయాలి. 2011కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి ఉపశమనం కల్పించేలా ఉన్నత న్యాయస్థానంలో, అలాగే కేంద్ర ప్రభుత్వంతో చట్టపరంగా ప్రాతినిధ్యం చేయాలి. ఉపశమనం లభించకపోతే ప్రతి సంవత్సరం సేవకు ఒక మార్కు వెయిటేజ్ ఇవ్వాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

ఇన్‌సర్వీసు వారికి టెట్ సరికాదు



2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని ఎన్‌సీటీఈ స్పష్టంగా తెలిపింది. అయితే.. ఐదు సంవత్సరాలకు పైగా సేవలో ఉన్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు రెండు సంవత్సరాలలోపు టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత తప్పరిసరి చేయడం సరికాదు.

- మల్లు రఘునాథరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

ఉపాధ్యాయులకు టెట్ హాస్యాస్పదం



సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు కూడా రెండు సంవత్సరాల్లో టెట్ పాస్ కావాలి. ఈ తీర్పుపై యూటీఎఫ్, ఎస్టీఎఫ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు ప్రభుత్వాలు రివ్యూ పిటీషన్ దాఖలు చేశాయి. అదేవిధంగా మన రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం కూడా రివ్యూ పిటీషన్ వేయాలి. టెట్‌ను సర్వీస్ ఉపాధ్యాయులకు తప్పనిసరి చేయడం హాస్యాస్పదం.

- బి.లక్ష్మీరాజ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సహేతుకం కాదు



2011కు ముందు టెట్ లేదు. అంతకంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో నెగ్గి ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నాం. 20, 30 ఏళ్లుగా ఎంతోమంది విద్యార్థులను ప్రయోజకులుగా తయారుచేశాం. ఇటువంటి వారు టెట్‌లో అర్హత సాధించాలనడం ఎంతమాత్రం సహేతుకం కాదు.

- రామాంజనేయులు, ఏపీఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

నూతన వధూవరులకు చంద్రబాబు ఆశీర్వాదం



రిసెప్షన్‌కు హాజరైన సీఎం చంద్రబాబు, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్

కడప, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కుమారుడు ప్రహర్ష, అఖిల దంపతులను సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లు ఆశీర్వదించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి అన్వయ కన్వెన్షన్ సెంటర్‌లో రిసెప్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎల్‌వీ రమణ, మంత్రులు ఎండీ ఫరూక్, నారాయణ, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మాధవి, ఆదినారాయణరెడ్డి, సుధాకర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, బీటెక్ రవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితీశ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

కళావేదిక ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళావేదిక సభ్యులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):వర్ధమాన, నూతన కవులను ప్రోత్సహిస్తూ తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, బాషా కీర్తి ఇనుమ డింప జేయడానికి కళావేదిక సంస్థ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, పలు రాష్ట్రాల్లో కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముని గోపాలకృష్ణ, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం తెలిపారు. కళావేదిక సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం పర్యవేక్షణలో, అన్నమయ్య జిల్లా కళావేదిక కమిటీ కో ఆర్డినేటర్ జింకల మోహన్‌వల్లి అధ్యక్షతన సొసైటీ కాలనీ, రామాలయంలో ఆదివారం 158వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంస్థ వివిధ జిల్లాల్లో 48 గంటలు, 33 గంటల నిరంతర సాహిత్య కార్యక్రమాల ద్వారా కళా కారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మునిగోపాలకృష్ణ వృద్ధ రక్షిత రక్షత: కవితను చదివి వినిపించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 150 మంది కవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, జ్ఞానోదయ ప్రసాదరావు, డాక్టర్ పరందామ గౌడ్, డాక్టర్ పార్థసారథి, శ్రీహరికోటి, కృష్ణవేణి, నరసయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-19 తైక్వాండో ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ అధికారులు

రైల్వేకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీవీ ఎస్ఆర్ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు ఎన్‌వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆది, సోమవారాల్లో నిర్వహించే ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్టు త్వరలో జమ్మూలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుం దన్నారు. సోమవారం ఎంపిక చేసిన జట్టు వివరాలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి సి. శారద, చిన్న ఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హరిత, పోటీల పరిశీలకుడు డి.శ్రీనువాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏ. సుబ్బరాజు, ఎస్. విజయ్‌ప్రసాద్‌రెడ్డి, అరుణ, నాగేశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మురళీకాష్టారెడ్డి,నీలకంఠరావు, సోమశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అరికెల విద్యార్థిని



విద్యార్థిని పద్మప్రియతో ఉపాధ్యాయులు

రామసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు మండలంలోని అరికెల జడ్పీ హై స్కూల్ పీడీ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబలకోట మండలం అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో నిర్వ హించిన జిల్లా స్థాయి అండర్-17 బాలికల వాలీబాల్ పోటీలలో అరికెలలో 10వ తరగతి చదువుతున్న పద్మప్రియ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అయిందని ఆయన తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలపతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు పద్మప్రియను అభినందించారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న కె.శ్రీహరిరావు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు డిమాండ్ చేశారు. ఆదివారం కడప బీసీ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం అందించాలని, ఈఎస్ఐ సౌకర్యం, టూల్‌కిట్లు ఇవ్వాలని కోరారు. జనవరి 27ను సర్ థామస్ అల్వా ఎడిసన్ జయంతిగా ఎలక్ట్రికల్ డేగా గుర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ ,రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పాలు రాజ్, కార్యదర్శి మాదన్న, గౌరవాధ్యక్షుడు వై.శుక్రరావు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



అజయ్‌కుమార్ మృతదేహం

చిన్నమండెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై కస్తూర్బా స్కూల్ దగ్గర ఆపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాయచోటి మండలం ఏజీ గార్డెన్ నివాసి అజయ్‌కుమార్ (19) ఆదివారం బైక్‌పై గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు వస్తూ కస్తూర్బా స్కూల్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆరుగురు బైకర్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైకులతో ఎస్ఐ తిరుపాల్‌నాయక్

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో బైపాస్‌రోడ్డులో అధిక వేగం తోను, ఒకే చక్రంపై, పెద్ద శబ్దాలను చేస్తూ బైకు నడిపిన ఆరుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. రెండు రోజులుగా బైపాస్ రోడ్డులో యువకులు హల్‌చల్ చేసిన విషయం పోలీసుల దృష్టికి రావడంతో మూడు బైకులు స్వాధీనం చేసుకొని యువకు లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా ద్విచక్ర వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కూలిన మట్టి మిద్దె



కూలిన మట్టిమిద్దె పైకప్పు

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం జెండామాను వీధిలో మాబుఖాతున్ అనే మహిళకు చెందిన మట్టిమిద్దె కూలి పో యింది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు నాని పోయిన మట్టి మిద్దె శనివారం రాత్రిఉన్నట్లుండి కూలిపోయింది. అయితే ఇంట్లో ఎవరు లేక పోవడంతో ఇంట్లోని వస్తువులు మాత్రమే దెబ్బతిన్నాయి. సుమారు రూ. 50 వేలు నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేయించాలని కోరారు.

గుంజనేరు పరివాహక ప్రాంతాల్లో తుఫాను భయం!

● ప్రతి ఏటా కూలుతున్న ఇళ్లు ● రక్షణగోడ నిర్మించాలని డిమాండ్




గుంజనేరులో ప్రవహిస్తున్న నీరు

రైల్వేకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వస్తోందంటే చాలు గుంజనేరు, ముష్టేరు, మేకలగుంతేరు, గుండాలేరు పరివాహక ప్రాంతాల్లోని ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. తుఫాన్ హెచ్చరికలతో ఇప్పటికే భయం మొదలైంది. రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని నరసరాంపేట, ధర్మాపురం, చిన్నలాలాపేట, గాండ్లవీధి తదితర ప్రాంతాల్లోని నదీ తీరాల్లో ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు నరసరాంపేటలోని నదీ తీరంలో ఉన్న సుమారు పది ఇళ్లు కూలిపోయాయి. ఈ ప్రాంతంలో నది నుంచి రక్షణకు గోడ నిర్మించాలని ప్రజలు పదే, పదే విన్నవిస్తుండడంతో, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రక్షణ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే, నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ టెండర్లు పిలిచి ఆ పనులను ప్రారంభించింది. అంతలోనే భారీ వర్షాలకు కురవడంతో పనులు ఆగిపోయాయి. ఇక ధర్మాపురం, చిన్నలాలాపేట, గాండ్లవీధి గ్రామాల్లో నదీతీరంలో సుమారు 300 పేద కుటుంబాలు నివసిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసినపుడు అధికారులు ఆయాల ప్రాంతాల ప్రజలను అధికారులు స్థానిక హెచ్‌ఎంఎం హైస్కూలు, నారాయణ స్కూలు, గౌరీశంకర్ స్కూలు తదితర ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడికి తరలిస్తుంటారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి ఎక్కువైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్లు రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. ప్రజలు చెరువుల వద్దకు కూడా ప్రజలు వెళ్లవద్దని అధికారులు సూచించారు. చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరించారు.



గాండ్లవీధి ప్రాంతంలో ప్రవాహం పక్కనే పేదల ఇళ్లు



నరసరాంపేటలో నదీపరివాహక ప్రాంతంలో పేదల ఇళ్లు

పేదలకు రక్షణ లేదు



ప్రతి ఏటా ఇళ్లు కూలిపోతున్నాయి. వాటిని కట్టించేందుకు ప్రభుత్వం ముందుకు రాక పోవడంతో కూలిపోయిన ఇళ్లలోనే బతుకుతున్నారు. రక్షణ గోడ నిర్మించి ఉంటే మేలు జరిగేది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని రక్షణగోడ పనులు పూర్తి చేయాలి.

- లింగాల యానాదయ్య, నరసరాంపేట

ఇళ్లు ఖాళీ చేయాల్సిందే..



భారీ వర్షాలు వస్తాయంటే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. వరద తగ్గిన తర్వాత ఇళ్లు శుభ్రం చేసుకుని అందులోనే నివాసముంటున్నాం. మా గోడు ఎవరూ విని పించుకోవడం లేదు. ఇంటి స్థలాలతో పాటు, పక్కా ఇళ్లను మంజూరు చేయాలని గతంలో విన్నవించాం

- చింతల వెంకటరమణ, నరసరాంపేట

చెరువుల పరిశీలన

● మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



యర్రబల్లె చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

పులివెందుల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య చెరువులను, కుంటలను పరిశీలించారు. ఆదివారం పులివెందుల మండలంలోని యర్రబల్లె చెరువును పరిశీలించారు. తుఫాన్ ప్రభావం పెరిగితే ప్రజలకు పునరావాసం కల్పించేందుకు పులివెందులలోని న్యాక్ భవనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో ఎవరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ కడప జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారన్నారు. మట్టిమిద్దెలు, పెద్ద పెద్దచెట్ల కింద, వాగులు,వంకలు, నదులు, చెరువులకు దిగువన నివాసం ఉండరాదన్నారు. గండి క్షేత్రం ఎదురుగా ఉన్న పాపాఘ్ని నదిలోకి భక్తులు వెళ్లరాదన్నారు. ,లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పైడిపాళెం, సర్వరాయసాగర్ తదితర ప్రాజెక్టుల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైన సమస్య ఉత్పన్నమైతే మరమ్మతులు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే లింగాల మండలంలో జూనియర్ అసిస్టెంట్ సతీష్ మొబైల్ నెంబర్ (9493778390), వీఆర్వో నాగార్జున (77990770084), పులివెందుల వాసులు ఆర్ఐ షెక్షావలి (995177271) వీఆర్వో శ్రీనివాసరెడ్డి (8978811567), చక్రాయపేట మండల వాసులు ఆర్ఐ గురుబాబు (798909766), వీఆర్వో మధుసూదన్‌రెడ్డి (9849722607), వేములవాసులు ఏఎస్ఓ మల్లికార్జున (8328289319), వీఆర్వో ఎర్రస్వామి (820082425), సింహాద్రిపురం మండల ప్రజలు వీఆర్వో నిరంజన్‌కుమార్ (6302545306), ఆపరేటర్ మల్లిక్ (8328509819), తొండూరు మండలవాసులు సీనియర్ అసిస్టెంట్ కుమారి (7569150977), వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి (8328505068), వేంపల్లె మండల ప్రజలు వీఆర్వో ఓబయ్య (99590706523), వీఆర్వో రవీంద్రనాథ్ రెడ్డి (9703739557), వీరపునాయునిపల్లెలో ఎలక్షన్ ఆపరేటర్ బాష (9160709639), వీఆర్వో దొరబాబు (7702553857)కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చిన్నయ్య (9849904111), రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర (8919134718) నెంబర్లలో 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 24 గంటలూ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

నిండు కుండలా ఝురికోన

● ప్రాజెక్టుకు చేరుతున్న 50 క్యూసెక్కుల వరద నీరు

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఝురికోన ప్రాజెక్టు ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టులోకి 50 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని, అలుగు పారుతుండడంతో 50 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి వెళుతున్నట్లు తెలియజేశారు. బాహుదా నది పైభాగంలో వర్షాలు బాగా కురవడంతో వర్షపు నీరు ఝురికోన ప్రాజెక్టుకు చేరుతోంది. సంబేపల్లె, సుండుపల్లె, కేవీ పల్లి మండల రైతుల జీవన సాగునీటి ప్రాజెక్టు ఝురికోన. బాహుదా నదిపై 0.5 టీఎంసీల సామర్థ్యంతో 2008-09లో ఝురికోన ప్రాజెక్టును సంబేపల్లె మండలం వల్లబండపల్లి సమీప ప్రాంతంలో నిర్మించారు. ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా ఒక ఎకరాకు కూడా సాగునీటి సౌకర్యం కల్పించలేదు. కేవీపల్లి, కలకడ, పీలేరు ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా తాగునీటిని మాత్రం వినియోగించుకుంటున్నారు. మూడు మండలాల రైతులకు సాగునీరు సంబేపల్లె, చిన్నమండెం మండలాలకు తాగునీరే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. కానీ అది మాత్రం నెరవేరలేదు. ఇప్పటికైనా ప్రాజెక్టు ఆశయం నెరవేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



ప్రాజెక్టు నిండి అలుగు పారుతున్న దృశ్యం

తెలుగుబిడ్డల ఆరాధ్యుడు ఎన్టీఆర్





ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు సుధాకర్‌యాదవ్, గల్లా మాధవీ

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తెలుగు బిడ్డల ఆరాధ్య దైవం స్వర్గీయ డాక్టర్ నందమూరి తారకరామారావు అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధా కర్‌యాదవ్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవిఅన్నారు. ఆదివారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాకతీయ కమ్మవారి అన్నదాన సత్రంలో డాక్టర్ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడు తూ ప్రసాద పథకం కింద దేవస్థానం అభివృద్ధికి రూ.150 కోట్లు డీపీఆర్‌ను కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. రాబోవు నాలుగైదు సంవత్సరాల్లో బిమఠం మండల రూపు రేఖలు మారనున్నాయన్నారు. ముఖ్యంగా కాలజ్ఞాన కర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. దేవస్థా నం పరిధిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల కాకతీయ కమ్మవారి అన్న దానసత్ర కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు 1984 సంవత్సరంలో ఏర్పాటు చేయడయం జరిగిం దన్నారు. అనంతరం కమిటీ సభ్యులు గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్యే పుట్టాను శాలువా పూలమాలలతో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎల్లటూరు సాంబశివారెడ్డి, టీడీపీ యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి, కమిటీ సభ్యులు చేరెడ్డి గద్దె కాశయ్య, చేరెడ్డి పేరయ్య, గాలి పాపారావు, ఎల్ఐసీ అంజిబాబు, అంజయ్య రమణయ్య, వెంకటేశ్వర్లు, కేశవరావు, పుల్లారా వుతో పాటు కమిటీ సభ్యులు, కమ్మ సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉధృతంగా బాహుదా నది ప్రవాహం

● పలు గ్రామాలకు రాకపోకలు బంద్



ఉధృతంగా ప్రవహిస్తున్న బాహుదా నది

కలకడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాహుదా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కలకడ నుంచి పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మండలంతో సహా కలికిరి, కేవీపల్లి పరిధిలో ఉన్న బాహుదా నది ఉధృతంగా ప్రవహి స్తోంది. అధికారుల ఆదేశాలతో పాపిరెడ్డిగారిపల్లి-మహల్, కలకడ-తువ్వపల్లితో పలు నది ప్రవహిస్తున్న మార్గాలను ముందు జాగ్రత్త చర్యగా రెవెన్యూ అధికారులు మూసివేశారు. ప్రజలు గ్రామాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ రోడ్ల ద్వారా ప్రయాణం సాగిస్తున్నారు. రైతులు పొలాల వద్దకు చేరుకోవడానికి, పాడి రైతులు పశుగ్రాసం కోసం అవస్థలు పడుతున్నారు.

పాపాఘ్ని నదిలోకి వెళ్లవద్దు - డీఎస్పీ



పాపాఘ్ని నదిలో జెండాలు పాతి హెచ్చరిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్, భారీ వర్షాల నేపథ్యంలో పాపాఘ్ని నదిలోకి ఎవరూ వెళ్లవద్దని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ హెచ్చరించారు. వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఉన్న పలు రహదారుల్లో ఎర్రజెండాలను పాతించారు. పాపాఘ్ని నదిలోకి వెళ్లవద్దని బ్యానర్లు ఏర్పాటుచేశారు. గుంతలు ఉన్నాయి పెద్దలు,పిల్లలు ఎవరు వెళ్లిన ప్రమాదం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు. సీఐ నరసింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఉన్నారు.

నేషనల్ లెవెల్ అబాకస్‌లో నాగార్జున స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఈనెల 26న జరిగిన నేషనల్ లెవెల్ క్యూబాటిక్ అబాకస్ పరీక్షలో కడప నగరం నాగార్జున స్కూల్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ద్వితీయ బహుమతులు తబిత శ్రేష్ట(5వ తరగతి), వై.మోక్షజ్ఞ (4వ తరగతి), తృతీయ బహుమతులు వి.భారతి (5వ తరగతి), చతుర్థ బహుమతులు పి.రేయానాఖాన్ (6వ తరగతి), ఎం.మోక్షితారెడ్డి (5వ తరగతి), పి.సోహిత్ (3వ తరతి), లక్ష్మీ కాస్వీరెడ్డి (3వ తరగతి) సాధించారు. నాలుగో మెరిట్ బహుమతులు కె.శ్రీనిధి (5వ తరగతి), పి.నూరమహమ్మద్ (4వ తరగతి), పి.శివసాహితీప్రియ (4వ తరగతి), ఎం.నివేదిత (2వ తరగతి)లు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ కె.శివతులశమ్మ, డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ సి.కృష్ణారెడ్డి, హెడ్ మిసెస్ సుశీల దేవి విద్యార్థులను అభినందించారు.

'ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిర్వహణ అన్యాయం'

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇన్ సర్వీస్‌లో ఉన్నఉపాధ్యాయులకు కూడా టెట్ క్వాలిఫై కావాలని కోర్టు ప్రకటించడం,దీన్ని కేంద్ర రాష్ట్రాలు పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షలు విద్యా ప్రమాణాలు కోసం, ఉపాధ్యాయ అర్హతను నిర్ణయించడానికి నిర్వహించబడతాయన్నారు. 20, 25 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా సేవలు చేస్తూ వారి వయసుపరంగా మళ్లీ పరీక్షలు రాయడం కష్టంతో కూడిన పనని అన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించి వారికి విద్యా వ్యవస్థపైమంచి నమ్మకం కలిగేటట్లు చేయాలని తెలిపారు.

మొంథా తుఫాన్ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

కడప నాగరాజుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. తుఫాన్ సహాయ కార్యక్రమాల్లో పాల్పంచుకుని, ప్రజలకు అండగా నిలవాలని కోరుతూ ఆదివారం సాయంత్రం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారుపేర్కొన్నారు. ప్రభుత్వ అధికారుల సహకారం తీసుకొని మంచినీరు, భోజనం తదితర సౌకర్యాలు కల్పించా లన్నారు. ఈ సమావే శంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, జిల్లా సీనియర్ నాయకులు పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల తనిఖీ

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఉన్న ప్రైవేట్ బస్సులను సీఐ నరసింహులు తనిఖీ చేశారు. డ్రైవర్లకు బ్రీథింగ్ అనలైజర్‌తో చెక్ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

దళితులకు న్యాయం చేయాలి



చినరాముడును సత్కరిస్తున్న దృశ్యం

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలోని ఎస్సీలకు న్యాయం చేసేలా ప్రత్యేక చొరవ చూపాలని అంబేడ్కర్ నేషనల్ విజన్ ట్రస్టు వ్యవస్థాపకులు భవనాశి శివప్రసాద్, లోకేశ్ ఎస్సీ కమిషన్ సెక్రటరీని కోరారు. గతంలో కడప ఆర్డీవోగా పనిచేసి ప్రస్తుతం ఎస్సీ కమిషన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న చినరాముడు ఆదివారం కడపకు వచ్చారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల భూములను అగ్రవర్ణాల వారు కాజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చినరాముడును కలిసినవారిలో గిరిజన అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, అఖిలభారత బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాదికారి డాక్టర్ శివానాయక్, న్యాయవాది భవనాశి శ్రీనివాసులు పాల్గొన్నారు.

దశలవారీగా సమరశీల పోరాటాలకు సిద్ధం

కడప సెవెన్‌రోడ్స్ అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి ఫలాలు కొందరికే లభిస్తున్నా యని ఆ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ప్రజా ఉద్యమాలు చేసినపుడే జిల్లా అభివృద్ధి చెందుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్ తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో సీపీఎం రెండో రోజు శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. రానున్నకాలంలో సీపీఎం దశలవారీగా సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు.

సమాజ సేవ జీవితంలో భాగం కావాలి

చెన్నూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవితంలో సమాజ సేవను ఒక భాగంగా మలుచుకోవాలని మానవతా సంస్థ ఛైర్మన్ రామాంజులరెడ్డి అన్నారు. మండలంలోని కొండపేట గ్రామంలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం నిరంతరం ప్రజా సేవలో ఉన్న మానవతా సంస్థ సభ్యుడు ఆటోబాబును, కొండపేట సర్పంచ్ తుంగా చంద్రయాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షుడు జీవన్ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మన్నెం మోహన్‌రెడ్డి, లేవాకు సుబ్బారెడ్డి, గోదిన శ్రీనివాసులు, నీలం శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ నాగిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కుక్కల తరలింపు



వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో విచ్చలవిడిగి తిరుగుతున్న కుక్కలను తరలించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. చంద్రగిరి నుంచి ప్రత్యేక బృందాన్ని పిలిపించి కుక్కలను పట్టుకుంటున్నారు. ఈనెల 22వ తేదీన ఆంధ్రజ్యోతిలో కుక్కలు బాబోయ్.. కుక్కలు అన్న వార్త ప్రచురితమైంది. అందులో కుక్కల వలన ఇబ్బందుల గురించి ఈఓ నాగభూషణంరెడ్డి స్పందించి ఆదివారం నుంచి కుక్కలను పట్టిస్తున్నారు. పూర్తిస్థాయిలో కుక్కలను తరలించేందుకు కొద్దిరోజులు ఇక్కడే ప్రత్యేక బృందం ఉంటుందన్నారు. చెత్త సంపద కేంద్రం ఇన్‌చార్జి తెలంగాణ వలి, పంచాయతీ సిబ్బంది వెంట ఉన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం రద్దు

హెల్ప్‌లైన్ నెంబర్ 9949093772

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఈనెల 27వ తేదీ సోమవారం అధిక వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వాతావరణ పరిస్థితుల ను దృష్టిలో ఉంచుకొని, కడప నగర పాలక సంస్థ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్) కార్యక్రమం రద్దు చేసినట్లు కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి తెలిపారు. వర్షాల కారణంగా నగర ప్రజలకు ఏమైన ఇబ్బందులు ఎదురైన సందర్భంలో వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 9949093772కుకాల్ చేసి తమసమస్యలను తెలియజేయాల్సిందిగా కమిషనర్ సూచించారు.

సబ్సిడీ శనగలు మంజూరు

పులివెందుల రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలానికి 500క్వింటాళ్ల శనగలు మంజూరు అయినట్లు ఏవో చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాల్‌కు పూర్తి ధర రూ.7800 కాగా 25శాతం సబ్సిడీ రూ.1950 పోను రైతులు రూ.5850 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విస్తీర్ణాన్ని బట్టి గరిష్టంగా ఐదుబ్యాగులు (100 కేజీలు) పంపిణీ చేస్తామ న్నారు. రైతుసేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

సింహాద్రిపురం..: మండలంలో రబీ సీజన్ శనగ విత్తనాల పంపిణీకి సోమ, మంగళవారాల్లో రిజిస్ట్రేషన్లు ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో జరుగుతాయని ఇన్‌చార్జ్ ఏఓ రామాంజులరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 2900 క్వింటాళ్ల విత్తనాలు మంజూరైనట్లు ఏఓ తెలిపారు.

కమలాపురం రూరల్..: ప్రతి రైతుకు శనగ విత్తనాలు అందిస్తామని ఏవో సరస్వతి అన్నారు. ఆదివారం మండలపరిధిలోని పలు గ్రామాల్లో శనగ విత్తనాల పంపిణీ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు శనగవిత్తనాలు అందించే విధంగా చూస్తామని అన్నారు. పట్టాదారు పాస్‌బుక్, వన్‌బీ అడంగల్, ఆధార్‌కార్డు తీసుకురావాలని తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 28వతేదీ వరకు ఉంటుందన్నారు.

లింగాల..: రబీ సీజన్‌లో శనగ పంట సాగుచేసే రైతుల కోసం ప్రభుత్వం 25శాతం సబ్సిడీ మండలానికి 1100 క్వింటాల్ విత్తన శనగలను మంజూరు చేసిందని ఏఓ రమేష్ తెలిపారు. ఆయా రైతు సేవా కేంద్రాలలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వేంపల్లె..: సబ్సిడీ శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ శివశంకర్‌రెడ్డి తెలిపారు. రిజిస్టర్ చేయించుకున్న రైతులకు రెండు,మూడు రోజుల్లో విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

వీరపునాయునిపల్లె..: మండలంలో ఆదివారం నుంచి శనగ విత్తన నమోదు ప్రారంభించినట్లు ఏవో శ్యామ్ బాబు తెలిపారు. మండలానికి 2400క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు తెలియజేశారు. ఇందుకూరు, గంగిరెడ్డిపల్లె, ఎన్.పాలగిరి,ఎస్.పాలగిరి రైతు సేవాకేంద్రం పరిధిలో జరుగుతున్న విత్తన నమోదును పరిశీలించారు.

తెలుగుబిడ్డల ఆరాధ్యుడు ఎన్టీఆర్





ఎన్టీఆర్‌విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు సుధాకర్‌యాదవ్, గల్లా మాధవీ

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 26 (ఆం ధ్రజ్యోతి): రాష్ట్రంలోని తెలుగు బిడ్డల ఆరాధ్య దైవం స్వర్గీయ డాక్టర్ నందమూరి తారకరామారావు అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధా కర్‌యాదవ్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవీలు పేర్కొన్నారు. ఆదివారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాకతీయ కమ్మ వారి అన్నదాన సత్రంలో నూతనంగా డాక్టర్ నందమూరి తారకరామారా వు కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించా రు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. పుట్టాసుధా కర్ యాదవ్ మాట్లాడుతూ ప్రసాద పథకం కింద దేవస్థానం అభివృద్ధికి రూ.150 కోట్లు డీపీఆర్‌ను కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. రాబోవు నాలు గైదు సంవత్సరాల్లో బిమఠం మండల రూపురేఖలు మారనున్నా యన్నారు. ముఖ్యంగా కాలజ్ఞాన కర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. దేవస్థా నం పరిధిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల కాకతీయ కమ్మవారి అన్నదానసత్ర కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు 1984 సంవత్సరంలో ఏర్పాటు చేయడయం జరిగిం దన్నారు. అనంతరం కమి టీ సభ్యులు గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవీ, ఎమ్మెల్యే పుట్టాను శాలువా పూలమాలలతో కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎల్లటూరు సాంబశివారెడ్డి, టీడీపీ యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి, కమిటీ సభ్యులు చేరెడ్డి గద్దె కాశయ్య, చేరెడ్డి పేరయ్య, గాలి పాపారావు, ఎల్ఐసీ అంజిబాబు, అంజయ్య రమణయ్య, వెంకటేశ్వర్లు, కేశవరావు, పుల్లారావుతో పాటు కమిటీ సభ్యులు, కమ్మ సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల అభ్యున్నతికి కృషి చేస్తాం



అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): కార్పెంటర్ల సంక్షేమానికి, అభ్యున్నతికి ప్రభుత్వ సహకారంతో అండగా నిలిచి ఎల్లవేళలా తోడుంటానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదురుగా కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పెంటర్లందరు ఐకమత్యానికి చిహ్నంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో దండపాణి గ్రూప్స్ అధినేత రామరాజు శ్రీనివాసకుమార్, సీపీఎం నేత సత్యనారాయణాచారి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరాంజనేయులు, నరసింహులు, ట్రెజరర్లు చాంద్‌బాష, శ్రీనివాస్, మీడియా కన్వీనర్ నరేషాచారిపాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మైలవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌తో మారెడ్డి లక్ష్మిదేవి (56) అనే మహిళ ఆదివారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు కర్మలవారిపల్లెలో నివాసం ఉండే మారెడ్డి లక్ష్మిదేవి.ఇంటిలో బట్టలను ఉతికి ఆరవేస్తుండగా రేకుల షెడ్డు ఉండడంతో ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగిలి అక్కడికక్కడే పడిపోయింది. వెంటనే భర్త మాధవరెడ్డి ఆమెను కాపాడే ప్రయత్నంలో విద్యుత్తు షాక్ తగిలి గాయాలయ్యాయి. వెంటనే జమ్మలమడుగుఆస్పత్రికి తరలించగా అప్పటికే లక్ష్మిదేవి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తుఫానుతో అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో సాయిశ్రీ సూచించారు. ఆదివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభా భవనంలో ఆర్డీవో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు వారి వారి మట్టి మిద్దెలు ఉరుస్తున్నాయని, కొన్ని పడిపోవడం జరిగిందని చెప్పారు. జమ్మలమడుగు డివిజన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే కంట్రోల్ రూముకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సైదున్నీసా, విద్యుత్ శాఖ అధికారులు రాజగోపాల్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఆర్డీవో

బద్వేలు , అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలను బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతబడిన భవనాలు, మట్టిమిద్దెలు ప్రమాదకర నిర్మాణాలలో ఉండే వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

గండికోట ప్రాజెక్టు సందర్శన

కొండాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సాగునీటి రంగ విశ్లేషకులు డాక్టర్. టీ.లక్ష్మీనారాయణ రైతుసేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు భవానిప్రసాద్‌తో కలిసి ఆదివారం గండికోటప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆయన మాటాడుతూ గండికోట ప్రాజెక్టు కింద భూములు, ఇళ్లు కోల్పోయిన 22 గ్రామాల నిర్వాసితులకు పునరావాస ప్యాకేజి చెల్లించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. ప్రాజెక్టులో నీరు ఉన్నాకాలువల నిర్మాణం పూర్తికాక, ఒక్క ఎక రాకు నీరు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధి మోదీతోనే సాధ్యం

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక పురోగతి ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జె.వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రొద్దుటూరు అర్బన్-2 అధ్యక్షుడు పాలెంరెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించిన ఆత్మానిర్భర వికసిత భారత్ నూతన జైష్ గురించి ప్రచార వాహనాలు, కరపత్రికలను జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక శ్లాబ్‌లలో ఉన్న జీఎస్టీని రెండు శ్లాబులకు మార్చి ప్రజల ఆర్థిక ప్రగతికి బాటలు వేశారన్నారు. స్వదేశీ ఉత్పత్తులు, తయారీ, విక్రయాలతో దేశాభివృద్ధి గాడిన పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, నాయకులు బీరం సుబ్బారెడ్డి, గౌరీశంకర్, జయలక్ష్మి, వంకధార నరేంద్ర, శివాలయం కమిటీ డైరెక్టర్ విక్రాంత్ పాల్గొన్నారు.

టెట్ తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి

బి.కోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టెట్ తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రివ్యు పిటీషన్ దాఖలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాధరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రీజనల్ కన్వీనరు వీవీ క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రితేష్ నేతృత్వంలో టీడీపీ బలోపేతానికి కృషి

కలసపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని మండల ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, కోశాధికారి రోశిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రంగారెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కోసం వీరారెడ్డి కుటుంబం కష్టపడి పనిచేసిందన్నారు.



శివాలయాలకు కార్తీక శోభ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా శైవ ఆలయాల్లో నెల రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలో ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో, అమృతేశ్వరస్వామి ఆలయాలతోపాటు అమృతేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించడానికి ముస్తాబు చేశారు.

కొండాపురంలో: కార్తీకమొదటి సోమవారం సందర్భంగా పలు శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిం చనున్నారు. మండలంలోని బాలప్పకోన, మల్లేశ్వ రకోన మండలంలోని తదితర శివాలయాల్లో వేకువజామునుంచే అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



